
సాక్షి బాపట్ల

బుధవారం । 8 । జనవరి । 2025



పాఠశాలలో జిల్లా కలెక్టర్ తనిఖీ


నరసరావుపేట రూరల్: మండలంలోని లింగంగుంట్ల గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను మంగళవారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు తనిఖీ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 565.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు వదిలారు.

ప్రసన్నాంజనేయునికి పూజలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయస్వామికి మంగళవారం రాచూరు జమిందారు సహకారంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నీ



మేదరమెట్ల: మండలంలోని రావినూతల గ్రామంలోగల రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 31వ అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ బుధవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. భ్రమర సంక్రాంతి కప్ 2025 పేరుతో నిర్వహించే ఈ పోటీలను ఉదయం 9.30 గంటలకు అతిథులచే ప్రారంభం కానున్నాయి. మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 లక్షలు, రూ.2 లక్షలు, రూ.లక్ష నగదు బహుమతులతోపాటు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద టోర్నీ, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాటర్, బెస్ట్ ఫీల్డర్ అవార్డులను బహూకరించనున్నారు. మొదటి మ్యాచ్ ఉదయం 10.30 జీడీసీపీ లెవెన్ (గుంటూరు)–స్పార్టన్ వారియర్స్ (తిరుపతి) జట్ల మధ్య మ్యాచ్ జరుగనుంది.

15 నుంచి రాష్ట్రస్థాయి నాటికల పోటీలు

యద్దనపూడి: మండలంలోని అనంతవరంలో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో నాటికపోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుడే పాండురంగారావు తెలిపారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గ్రామస్తుల సహకారంతో మూడేళ్లుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగురోజులపాటు నిర్వహించే పోటీల్లో 15న న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారిచే 'ఐ హేట్ ఇండియా, రెండో నాటిక సద్గురు కళానిలయం గుంటూరు వారిచే 'కమనీయం', 16న యంగ్ థియేటర్ విజయవాడ వారిచే '27వ మైలురాయి', వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారిచే 'నిశి', 17న స్నేహ ఆర్ట్స్ వింజనంపాడు వారిచే 'కొండంత అండ', శ్రీకారం రోటరీ కళాపరిషత్ వారిచే 'ఏది నిజం', 18న చైతన్య కళాస్రవంతి విశాఖపట్నం వారిచే '(అ)సత్యం', సాయి ఆర్ట్స్ కొలకలూరివారిచే 'జనరల్ బోగీలు' ప్రదర్శిస్తారు.

న్యూస్‌రీల్

అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షుల నియామకం

బాపట్ల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షుల నియామకాలు మంగళవారం జరిగాయి. రైతువిభాగం జిల్లా అధ్యక్షులుగా అద్దంకి చెందిన ఈద శ్రీనివాసరెడ్డి, వాణిజ్య విభాగానికి అధ్యక్షులుగా గునుపూడి రఘురామ్‌గుప్తాలను నియమించారు. ఈమేరకు పలువురు అభినందనలు తెలిపారు.

ధనుర్మాస గొబ్బిళ్ల ఉత్సవం



తెనాలి: ధనుర్మాసంలో గొబ్బిళ్లకు గల ప్రాధాన్యాన్ని తెలియజేసేలా మంగళవారం స్థానిక గంగానమ్మపేటలోని పారడైజ్ గృహసముదాయంలో గొబ్బిళ్ల ఉత్సవం చేశారు. ఆధ్యాత్మిక సేవకురాలు, భక్తిసంకీర్తన గాయని శారదా చలపతి బృందం ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. గొబ్బిళ్ల చుట్టూ పాటలు పాడారు. భక్తితో నమస్కరించారు. బొబ్బిళ్లను లక్ష్మీ స్వరూపంగా, గోపిక స్వరూపంగానూ పూజించారు. శారదా చలపతి మాట్లాడుతూ మన సంస్కృతిని చాటి చెప్పేందుకే ఈ వేడుక నిర్వహించినట్టు వెల్లడించారు. చలిగాలులు పెరిగిన ప్రస్తుత తరుణంలో ఈ ఉత్సవంలో వాడే ద్రవ్యాలన్నీ ఆరోగ్యపరంగా మేలు చేస్తాయని చెప్పారు. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు. మహాలక్ష్మి, నాగమణి, వర్ధని, ఆదిలక్ష్మి, శ్రీదేవి, మౌనిక, శుభ, జ్యోతి, ఆదిలక్ష్మి, పద్మజ, సుశీల, ధనలక్ష్మి, శివశక్తి, సునీల్ పాల్గొన్నారు.


సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. కాకినాడటౌన్–వికారాబాద్(07205) ప్రత్యేక రైలు ఈనెల 9న కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు వికారాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని వివరించారు. వికారాబాద్–శ్రీకాకుళం రోడ్డు (07207) ప్రత్యేక రైలు ఈనెల 10న సాయంత్రం ఐదు గంటలకు వికారాబాద్ స్టేషన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌కు చేరుకుంటుందని వెల్లడించారు. శ్రీకాకుళం రోడ్డు–చర్లపల్లి(07208) ప్రత్యేక రైలు 11న శ్రీకాకుళం రోడ్డు వద్ద మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి చర్లపల్లి స్టేషన్‌కు మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు.

ఎస్సీ కులగణనపై 12 వరకు అభ్యంతరాల స్వీకరణ పొడిగింపు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును ఈనెల 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందని ఎస్సీ వెల్ఫేర్ డీడీ డి.మధుసూదనరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈనెల 7వ తేదీతో ముగిసిందని చెప్పారు. దీంతో ప్రభుత్వం మరో ఐదురోజులు పొడిగించిందని వివరించారు. 12 వరకు స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా జనవరి 16వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని చెప్పారు. అనంతరం అన్ని తనిఖీలూ పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వివరించారు.

యార్డుకు 76,310 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 76,310 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 72,819 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,200 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 13,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 15,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 55,385 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

మరమ్మతులు.. మమ..

అధ్వానంగా రహదారులు



మంత్రిపాలెం - అడవులదీవి రహదారిలో దాసుళ్లపాలెం వద్ద రహదారి దుస్థితి



మంత్రిపాలెం-అడవులదీవి రహదారిలో శ్రీరామపురం వద్ద రహదారి దుస్థితి



ఎర్రంకి-గుర్నాథ్‌నగర్ మధ్య రహదారి దుస్థితి



గుణ్ణంతిప్ప వద్ద రహదారి పరిస్థితి



నల్లూరుపాలెం-తుమ్మల మార్గంలో బొందలగరువు వద్ద అరకొరగా చేసిన మరమ్మతులు



నల్లూరుపాలెం వద్ద తవ్వి వదిలేసిన రహదారి

సంక్రాంతి నాటికి రహదారులపై గుంతలు కనిపించకుండా పూడ్చి వేస్తామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. మరో వారం రోజుల్లో సంక్రాంతి సంబరాలకు పల్లెలు సిద్ధమవుతున్నాయి. రహదారులపై గుంతలు మాత్రం అలాగే కనిపిస్తున్నాయి. రేపల్లె నియోజకవర్గం పరిధిలోని పలు రహదారులపై గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరుకాగా స్థానిక నాయకులు, అధికారులపై ఒత్తిడి తెచ్చి పనులు చేయకుండానే బిల్లులు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రేపల్లె నియోజకవర్గంలో 46 కిలో మీటర్ల మేర రహదారి మరమ్మతులు, 126 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.21.34 కోట్లు కేటాయించింది. నల్లూరుపాలెం నుంచి తుమ్మల వరకు, మంత్రిపాలెం నుంచి అడవులదీవి వరకు, నగరం నుంచి పిట్టలవానిపాలెం వరకు రూ.6 కోట్లతో మరమ్మతులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఆయా రహదారులను పరిశీలిస్తే ప్రారంభంలో కొంత పనులు చేసినా మిగిలిన రహదారులపై తట్ట మట్టి పోసిన దాఖలాలు లేవు. నల్లూరుపాలెం నుంచి తుమ్మల వరకు ఆరు కిలోమీటర్ల మేర రహదారి ఉండగా తుమ్మల గ్రామం నుంచి ఒక కిలో మీటరు మేర అక్కడక్కడ రహదారులకు మరమ్మతులు నిర్వహించి మమ అనిపించారు. నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న మూడు రహదారుల నిర్మాణానికి రూ.9 కోట్ల నిధులు మంజూరైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. రేపల్లె–నిజాంపట్నం ప్రధాన రహదారికి రూ.5 కోట్లు, గంగడిపాలెం–లంకెవానిదిబ్బ, అడవులదీవి–కూచినపూడి రహదారి నిర్మాణాలకు రూ.4 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభించలేదు. –రేపల్లె రూరల్

పరిశ్రమల స్థాపనతో ఉత్పాదకత పెరుగుదల

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: పరిశ్రమల స్థాపనతో ఉత్పాదకత పెరుగుతుందని తద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో అభివృద్ధి పనులపై సమీక్షించారు. విత్తనాలతో డీజిల్ ఉత్పత్తి చేసే పరిశ్రమ కొరిశపాడులో రూ.245.66 కోట్లతో నిర్మిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. 500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కర్లపాలెం మండలంలో రూ.120 కోట్లతో మరో పరిశ్రమ ఏర్పాటు కానున్నదని, 800 మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. చీరాల ఇండస్ట్రియల్ క్లస్టర్‌లో రూ.10 కోట్లతో వైద్య రంగానికి అనుబంధమైన యూనిట్ స్థాపనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద ఇప్పటివరకు 36,100 దరఖాస్తులు రాగా, 2,649 మందికి యూనిట్లు మంజూరు చేశామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల విద్యుత్ కనెక్షన్‌ల సర్వే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. పల్లె పండుగ పనులు త్వరగా పూర్తిచేసి, జనవరి నెలాఖరులో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలోని అన్ని పంచాయతీలలో 3,133.63 కిలోమీటర్ల పొడవున అంతర్గత రహదారులు ఉన్నాయని చెప్పారు. అందులో సీసీ రోడ్లు 1,144.61 కిలోమీటర్ల మేర నిర్మించినట్లు వివరించారు. మరో 74.22 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉందన్నారు. మార్చి నెలాఖరునాటికి మరో 45.78 కిలోమీటర్ల దూరం సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారికంగా మంజూరు చేస్తామన్నారు. 654 సీసీ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మించాలని లక్ష్యం కాగా, 239 రోడ్లు మాత్రమే నిర్మించడంపైనా ప్రశ్నించారు. రహదారుల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతి గృహానికీ సురక్షిత నీరు

ప్రతి గృహానికీ సురక్షిత నీరు పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 3,64,788 గృహాలు ఉండగా, 1,48,361 గృహాలకు ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయని, మిగిలిన 2,16,427 గృహాలకు కనెక్షన్లు లేకపోవడం బాధాకరమన్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ ట్యాప్ కనెక్షన్లు ఇవ్వాలనే ఉద్దేశంతో రూ.587.55 కోట్ల నిధులు జిల్లాకు విడుదల అయ్యాయన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతి నెలా వసతి గృహాలను సందర్శించాలి

బాపట్ల: ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రతి నెలా తప్పనిసరిగా పరిశీలించి విద్యార్థులకు వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. వెల్ఫేర్ హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూలు తప్పనిసరిగా ప్రతి మెడికల్ ఆఫీసర్ ప్రతి నెలా విజిట్ చేయాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి రెండు రోజులకు ఒకసారి హాస్టల్‌ను విజిట్ చేయాలని చెప్పారు.

పోలీసులు తీరు మార్చుకోవాలి

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

చీరాల రూరల్: కక్షిదారులకు న్యాయ సహాయం అందించడంలో నిమగ్నమయ్యే న్యాయవాదులపై పోలీసులు తీరు దారుణంగా ఉందని.. న్యాయవాదులపై నిత్యం పోలీసులు దాడులకు తెగబడడం వారిపై తప్పుడు కేసులు బనాయించడం మానుకోవాలని చీరాల న్యాయవాదులు ముక్తకంఠంతో ఖండించారు. పొన్నూరు కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పోలీసులు దాడిచేసి గాయపరచడమే కాకుండా అయనపైనే కేసు నమోదు చేసిన విషయమై మంగళవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్‌బాబు, కొటిక ఉదయ భాస్కరరావు, పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత న్యాయవాదులపై పోలీసుల దాడులు చేయడం ఎక్కువయ్యాయన్నారు. గత పదిరోజుల్లో పోలీసులు మూడు చోట్ల దాడులు చేశారన్నారు. అనంతపురంలో పోలీసు స్టేషన్‌లో న్యాయవాది మరణించడం, మరో జిల్లాలో సుదర్శనరెడ్డి అనే న్యాయవాదిని చొక్కా పట్టుకుని నడిరోడ్డుపై సీఐ లాక్కెళ్లడం లాంటివి చూస్తుంటే ప్రజాస్వామ్యం ఎక్కడుందని ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణార్థం తక్షణమే ప్రభుత్వాలు స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బండారుపల్లి హేమంత్ కుమార్, ఆకిశెట్టి పుల్లయ్య నాయుడు, పుల్లెల హరిబాబు, కర్నేటి రవి, రాజు వెంకటేశ్వరరెడ్డి, బత్తుల అమృత్, మంకెన అశోక్ కుమార్, నీలి కస్తూరి నాథ్, మోపూరి తారకరామారావు, సిరిపురం కామేశ్వరరావు, గోదావరి సురేష్, బిళ్లా ఆరోగ్యరావు, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పర్మిట్ బుసక...అమ్మేది ఇసుక

ఇసుక తవ్వకాలపై ముదిరిన వివాదం

- వ్యవహారం ప్రభుత్వానికి చేరడంతో తాత్కాలికంగా ఇసుక రవాణా నిలిపివేత
- అక్రమ రవాణా కొనసాగించేందుకు పచ్చనేతల పర్మిట్ల ఎత్తుగడ
- అనుమతుల కోసం దరఖాస్తులు
- బుసక పేరుతో అనుమతులు
- వాటి మాటున ఇసుక అక్రమ రవాణా
- ముఖ్యఅధికారి సూచనతో కొత్త ఎత్తుగడకు దిగిన చీరాల పచ్చనేత
- ఆయనను అనుసరించిన మిగిలిన పచ్చనేతలు
- తిరిగి మొదలు కానున్న ఇసుక అక్రమ రవాణా



చినగంజాం మండలం కడవకుదురు ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా (ఫైల్)

సాక్షి ప్రతినిధి,బాపట్ల: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా వ్యవహారం సరికొత్త రూపం సంతరించుకోబోతోంది. చీరాలలో ఇసుక అక్రమ రవాణా శృతిమించి స్థానిక ఎమ్మెల్యే, బాపట్ల ఎంపీ వర్గాల మధ్య పరస్పర దాడులకు దారితీసి కేసులు పెట్టుకునే వరకు వెళ్లడం, ఈ వ్యవహారం రోడ్డెక్కి చర్చనీయాంశంగా మారడంతో బెంబేలెత్తిన అధికారులు ఐదు రోజులుగా ఇసుక రవాణా నిలిపివేశారు. దీంతో పచ్చనేతలు కొత్త పద్ధతిలో ఇసుక అక్రమ రవాణాకు తెరతీశారు. బుసక రవాణా పేరుతో పర్మిట్లు పొంది ఇసుకను అక్రమంగా తరలించి అమ్ముకునేందుకు పచ్చ నేతలు సిద్ధమయ్యారు. జిల్లాకు చెందిన ముఖ్య అధికారి సూచనలతోనే ఈ తరహా అక్రమాలకు పచ్చనేతలు సంసిద్ధమైనట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి బుసక రవాణా పేరుతో మొక్కుబడిగా కొన్ని పర్మిట్లు తీసుకొని వాటి మాటున ఇసుకను అక్రమంగా తరలించేందుకు పచ్చనేతలు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.

పర్మిట్లకు దరఖాస్తులు...

ఇసుక అక్రమ రవాణా విషయమై జిల్లా ముఖ్య అధికారితో చీరాల ప్రాంతానికి చెందిన పచ్చనేత ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఆ అధికారి సూచన మేరకు పచ్చనేత తన అనుచరులకు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. పచ్చనేత చెప్పిన మేరకు ఆయన అనుచరులు బుసక రవాణా కోసం కొన్ని ప్రైవేటు భూముల సర్వే నంబర్లు చూపి పర్మిట్లకు దరఖాస్తు చేస్తారు. పర్మిట్లు రాగానే గతంలోలాగే ఇసుక అక్రమరవాణాను మొదలు పెట్టనున్నారు. ప్రశ్నించేవారికి అధికారులు అనుమతులతో బుసక రవాణా చేస్తున్నట్లు చూపించుకుంటారు. త్వరలోనే పచ్చనేతలకు అధికారులు బుసక పర్మిట్లు ఇవ్వనున్నారు.

రంగంలోకి పర్చూరు నేతలు

చీరాల పచ్చనేత వ్యవహారం తెలుసుకున్న పర్చూరు పచ్చనేత చినగంజాం, కడవకుదురు ప్రాంతాల్లోని కొన్ని ప్రైవేటు భూముల సర్వే నంబర్లు వేసి బుసక పేరుతో పర్మిట్లు పొందేందుకు సిద్ధమైనట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారితోనూ మాట్లాడతానని, మైనింగ్ కార్యాలయానికి దరఖాస్తులు చేర్చాలని పచ్చనేత సూచించినట్లు సమాచారం.

నేతలపై అనుచరుల ఒత్తిడి

చీరాల, పర్చూరు పచ్చ నేతల బుసక పర్మిట్ల వ్యవహారం తెలుసుకున్న బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ అనుచరులతోపాటు బాపట్ల పచ్చనేత అనుచరులు బుసక పర్మిట్ల కోసం తమ నేతలపై ఒత్తిడి పెంచినట్లు తెలుస్తోంది. తాము కూడా జిల్లా ముఖ్య అధికారితో మాట్లాడతామని దరఖాస్తులు సిద్ధం చేసుకోవాలని బాపట్ల ఎంపీతోపాటు బాపట్ల పచ్చనేత తమ అనుచరులకు సూచించినట్లు సమాచారం.

ఎకరం రూ.40 లక్షలు

బాపట్ల, చీరాల ప్రాంతాల్లో ఇసుక భూములు అధికంగా ఉన్నాయి. భూమిలో 30 నుంచి 50 అడుగుల వరకూ ఇసుక నిల్వలే ఉండడంతో ఇక్కడి ఇసుకకు మరింత డిమాండ్. భూమి కాకుండా కేవలం ఇసుక అమ్మకాల కోసం ఎకరానికి రూ.30 నుంచి రూ.40 లక్షలు చెల్లిస్తున్నారు. చీరాల, బాపట్ల, చినగంజాం ప్రాంతంలో భూములు కొని బుసక పర్మిట్లతో ఇసుక అమ్మేందుకు జిల్లాలోని పచ్చనేతలందరూ పోటీ పడుతుండడంతో ఇసుక అక్రమరవాణా వ్యవహారం చివరకు అధికారుల మెడకు చుట్టుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో జిల్లా ముఖ్యఅధికారి ఏ విధంగా వ్యవహరిస్తారో వేచి చూడాల్సివుంది.

పోటీ పడుతున్న పచ్చనేతలు

అక్రమ ఇసుకవ్యాపారంతో రుచిమరిగిన పచ్చనేతలు బుసక పర్మిట్ల కోసం ఎగబడుతున్నట్లు సమాచారం. తమ ప్రాంతంలో ఇసుక లేకపోయినా ఇసుక అధికంగా ఉన్న ప్రాంతాలలో ఎకరం, రెండెకరాల ప్రైవేటు భూములు కొనుగోలు చేసి బుసక పేర్మిట్లు తీసుకొని ఇసుక అమ్ముకునేందుకు అన్ని నియోజకవర్గాలకు చెందిన పచ్చనేతలు సిద్ధమవుతున్నారు. తమకు కూడా చీరాల ,పర్చూరు, బాపట్ల, వేమూరు నియోజకవర్గాల్లో బుసక పర్మిట్లు ఇప్పించాలని ఆయా నియోజకవర్గాల పచ్చనేతలపై నేతలు ఒత్తిడి పెంచినట్లు తెలుస్తోంది. దీంతో పచ్చనేతలు ఇసుక భూములను కొనుగోలు చేసుకోవాలని అనుచరులకు భరోసా ఇచ్చారు.



పాఠశాల బస్సును ఢీకొట్టిన లారీ

ఐదుగురు విద్యార్థులకు, ఓ టీచర్‌కు స్వల్ప గాయాలు



స్కూల్ వ్యాన్‌ను ఢీకొట్టిన లారీ

కొల్లూరు: అతి వేగంగా దూసుకొచ్చిన లారీ ఓ ప్రైవేటు పాఠశాల బస్సును ఢీకొట్టిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొల్లూరులోని శ్రీ సాయి వాసవి విద్యా సంస్థలకు చెందిన స్కూల్ బస్సు మండలంలోని క్రాప నుంచి విద్యార్థులతో కొల్లూరు వస్తుంది. కొల్లూరు శివారు బోసునగర్ వద్ద విద్యార్థులను ఎక్కించుకునేందుకు డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపాడు. అదే మార్గంలో తెనాలి నుంచి ఇటుకరాయి కార్మికులను ఎక్కించుకొని వస్తున్న లారీకి ఎదురుగా ట్రాక్టర్ రావడంతో డ్రైవర్ లారీని నియంత్రించడంలో విఫలమయ్యాడు. లారీ వేగంగా రోడ్డు పక్కన ఆగి ఉన్న స్కూల్ బస్సును వెనుక నుంచి ఢీకొంది. స్కూల్ బస్సులోని విద్యార్థులు ఎం.కౌషిక్, కె.సంపత్ నాయక్, ఎం.జస్వంత్ సాయి, వై.దుర్గ, డి.ప్రేమ్ కుమార్, టీచర్ బి.వెంకటపద్మలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు హుటాహుటీన పాఠశాల వద్దకు చేరుకున్నారు. అప్పటికే పాఠశాల యాజమాన్యం విద్యార్థులను ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం విద్యార్థులను తల్లిదండ్రులతో తమ గృహాలకు పంపించారు.

క్లుప్తంగా

ఆప్కో చేనేత వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు

కొరిటిపాడు (గుంటూరు): సంక్రాంతి పండుగ సందర్భంగా అన్ని రకాల చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి డి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించడానికి విక్రయాలు పెరిగేలా ఈ తగ్గింపు అవకాశం ఇస్తున్నట్లు వెల్లడించారు. మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ, బందరు, రాజమండ్రి, మంగళగిరి చేనేత చీరలు, బెడ్‌షీట్స్, లుంగీలు, టవల్స్, రెడీమేడ్ వస్త్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అన్ని ఆప్కో విక్రయ శాలలతో పాటు ఆప్కో హ్యాండ్లూమ్స్.కామ్, ఆమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల వెబ్‌సైట్‌లో కొనుగోలు చేసి చేనేత పరిశ్రమకు చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

26న అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 26వ తేదీన అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ (2 + 2 పుష్ బ్యాక్) బస్సు బయలు దేరుతుందని డిపో మేనేజర్ జీఎస్ఎస్‌వీ కుమార్ మంగళవారం తెలిపారు. 26న మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి 27న తెల్లవారుజామున అరుణాచలం చేరుతుందన్నారు. దర్శనం అనంతరం తిరిగి కంచి మీదుగా 28న ఉదయం సత్తెనపల్లికి చేరుతుందన్నారు. టిక్కెట్ ధర రాను, పోను ఒక్కొక్కరికి రూ.2,100గా నిర్ణయించామన్నారు. వివరాలకు 9959225429, 7382897583 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లాప్ మిత్రల వినూత్న నిరసన

బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో మంగళవారం క్లాప్ మిత్రలు వినూత్న నిరసన తెలుపుతూ చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌కు తరలించకుండా సచివాలయానికి తీసుకొచ్చారు. గ్రామంలో గ్రీన్ అంబాసిడర్‌లుగా మాదాసు సుబ్బయ్య, కొమ్ము రామారావు, కందుకూరి యిర్మియాలు విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని నెలలుగా వేతనాలు సక్రమంగా అందకపోవడంతో ఇలా నిరసన తెలిపారు. సర్పంచ్ బ్రహ్మనాయక్, గ్రీన్ అంబాసిడర్ల మధ్య వాగ్వివాదంతో చెత్తను సచివాలయానికి తరలించి నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడటంతో నిరసన విరమించారు. చెత్తను సంపద కేంద్రానికి తరలించారు. పంచాయతీ సర్పంచ్ బ్రహ్మనాయక్, కార్యదర్శి శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. గతంలో ఐదు నెలల వేతనాలు చెల్లించామని, మరో 4 నెలలవి చెల్లించాల్సి ఉందన్నారు. గ్రామంలో నిధుల విషయంపై పంచాయతీ అధికారులకు గ్రామానికి చెందిన వి.శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేయడంతో పంచాయతీ రికార్డులు జిల్లా పంచాయతీ అధికారి వద్ద తనిఖీలో ఉన్నాయని తెలిపారు. గ్రీన్ అంబాసిడర్లకు రావాల్సిన వేతనాలు సక్రమంగా చెల్లిస్తామన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథరెడ్డి



బహుమతులు అందిస్తున్న మున్సిపల్ కమిషనర్

బాపట్ల: బాపట్ల మున్సిపాల్టీలో సంక్రాంతి సంబరాలను మంగళవారం నిర్వహించారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు మున్సిపల్ కార్యాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటేనే ముగ్గుల పోటీలు ప్రధానంగా ఉంటుందని తెలిపారు. మహిళలు ఎంతో అందంగా రంగవల్లులతో ముగ్గులు వేయటం సంతోషకరమని తెలిపారు. పోటీల్లో మొదటి బహుమతి నాయుడు శివపార్వతి, రెండవ బహుమతి కాకర్ల రాజేశ్వరి, మూడవ బహుమతి ఇళ్ల అపర్ణ విజేతలగా గెలుపొందారు. ఈ బహుమతులను డీఈ కృష్ణారెడ్డి, మేనేజర్ పి.లక్ష్మయ్య చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఎంఎం ఎన్.సుబ్రహ్మణ్యం, సీఓలు నవక్రాంత్, మీరా కుమారి, విజయలక్ష్మి, సమాఖ్యా జిల్లా అధ్యక్షురాలు అక్కల నాగ వరలక్ష్మి, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ డ్రైవర్లపై దాడి చేసిన ముఠా అరెస్ట్



దారిదోపిడీ ముఠా వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గోగినేని

బాపట్ల: రాత్రి సమయాలలో దారి దోపిడీ చేస్తూ లారీ డ్రైవర్లపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు చెప్పారు. బాపట్ల రూరల్ పోలీస్‌స్టేషన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్ల పట్టణం రైలుపేటకు చెందిన షేక్ మాధర్, చేగుడి ఆనంద్, మహమ్మద్ ఇక్బాల్, షేక్ బాషీద్‌లు గతంలో చీరాల, రేపల్లె, బాపట్ల, తెనాలి ప్రాంతాలలో అనేక నేరాలకు పాల్పడినట్లు తెలిపారు. ఈనెల 6వ తేదీ తెల్లవారుజామున బాపట్ల పట్టణంలోని ధనలక్ష్మి రైస్ మిల్లు వద్ద నుంచి లారీ ప్రకాశం జిల్లా మద్దిపాడు గ్రామానికి చెందిన రావూరి వాసు ఊక లోడుతో గుంటూరు రోడ్డులో వెళ్తున్న సమయంలో పై నిందితులు కొండబోట్లవారిపాలెం అడ్డదారిలో దారి కాచి వాహనాలు ఆపి లారీ డ్రైవర్ వద్ద ఉన్న రూ.1500 నగదు, రెండు సెల్ ఫోన్లు తీసుకొని ఆయుధంతో దాడి చేసి పారిపోయారన్నారు. సమాచారం అందుకున్న తమ పోలీసులు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా తామే నేరం చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పలు నేరాలకు పాల్పడ్డారని వీరిపై త్వరలోనే రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నట్లు చెప్పారు. నిందితులను అరెస్టు చేసిన పోలీస్ సిబ్బందిని అభినందించారు. సమావేశంలో రూరల్ సీఐ శ్రీనివాసరావు, రూరల్ ఎస్సై శ్రీనివాసులు పాల్గొన్నారు.

లారీపై నుంచి పడి డ్రైవర్ మృతి

అద్దంకి రూరల్: ప్రమాదవశాత్తూ లారీపై నుంచి కాలు జారిపడి లారీ డ్రైవర్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన మహమ్మద్ అబ్బాస్ (45) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీన లారీలో గుంటూరు నుంచి పత్తి విత్తనాలు లోడ్ చేసుకుని బయలుదేరాడు. సరుకును అద్దంకి మండలంలోని చినకొత్తపల్లి గ్రామంలోని శ్రీవాత్సవ బయోటెక్ లిమిటెడ్ కంపెనీకి 4వ తేదీ సాయంత్రం అప్పగించాడు. ఈ క్రమంలో లారీ క్యాబిన్ పైకి ఎక్కి టార్పాలిన్ పట్టను మడత వేస్తూ ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారంతో మంగళవారం మృతుని కుమారుడు మహమ్మద్ మగ్బూల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

230 బస్తాలు స్వాధీనం



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఎస్సై సురేష్

ఇంకొల్లు (చినగంజాం): అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఇంకొల్లు పోలీసులు సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఇంకొల్లు ఎస్సై సురేష్ వివరాల మేరకు.. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే ముఠా సోమవారం అర్ధరాత్రి చినగంజాం-ఇంకొల్లు మీదుగా ఒంగోలు తరలిస్తున్నట్లు ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు ఎస్సై, సిబ్బంది అప్రమత్తమయ్యారు. అర్ధరాత్రి సమయంలో చినగంజాం-ఇంకొల్లు రహదారిలో కాపుకాచి మండల పరిధిలోని భీమవరం గ్రామం వద్ద వాహనాన్ని చాకచక్యంగా అడ్డుకుని పట్టుకున్నారు. మినీ లారీలో 230 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్ గొట్టిపాటి వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకుని విచారించగా తనకు చినగంజాంకు చెందిన గోగినేని వెంకటరమణ రేషన్ బియ్యాన్ని లోడ్ చేసి పంపినట్లు ఎస్ఐకి తెలిపారు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

పంట కాలువలో పడి రైతు మృతి



అంబటి సత్యం (ఫైల్)

మాచవరం: ప్రమాదవశాత్తు పంట కాలవలో పడి రైతు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన మాచవరంలో మంగళవారం చోటు చేసుకుంది. మాచవరం గ్రామానికి చెందిన అంబటి సత్యం (40) పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ఆకురాజుపల్లి మేజర్ కాలువ పరిధిలోని విశ్వనాథ్ డ్రాపు సమీపంలో కాల్వకు అడ్డుకట్ట వేస్తుండగా కాలు జారి కాలువలో పడిపోయాడు. నీటి ప్రవాహంతో కొంత దూరం కొట్టుకుపోయాడు. నీట మునిగి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి

మేదరమెట్ల: ఎలుకల మందు పేస్టు తిన్న బాలుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ విషాద ఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల తమ్మవరం రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల.. తమ్మవరం రోడ్డులోని వాటర్ ట్యాంకు వద్ద నివాసం ఉంటున్న దుర్గారావు కుమారుడు నాగరాజు (2) ఈనెల 4వ తేదీన రోడ్డు పక్కన పడేసిన ఎలుకల మందు పేస్టు తింటుండగా తండ్రి చూసి ఒంగోలు రిమ్స్‌కు తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగరాజు మృతి చెందాడు. ఈ మేరకు మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మహ్మద్ రఫీ తెలిపారు.

హుండీ కానుకల దొంగతనం

పోలీసుల అదుపులో నిందితుడు?

గురజాల రూరల్: దేవాలయంలో హుండీని పగులగొట్టి కానుకలు దొంగతనం చేసిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మండల పరిధిలోని దైద గ్రామంలో వేంచేసియున్న అమర లింగేశ్వరస్వామి వారి దేవాలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని యువకుడు హుండీని పగులగొట్టాడు. హుండీలో ఉన్న దాదాపు రూ.4 వేలు తీసుకుని పులిపాడు గ్రామానికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు దేవాలయం వద్దకు వెళ్లి పరిశీలించారు. పులిపాడు గ్రామంలోని వైన్ షాపు సమీపంలో పోలీసులు ఉండటాన్ని గమనించిన యువకుడు పరిగెత్తి వెళ్లి సమీపంలోని చెరువులోకి దూకాడు. స్థానికులు అప్రమత్తమై యువకుడిని బయటకు తీసి పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం ఆ యువకుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

18న నవోదయ ఎంపిక పరీక్ష

చిలకలూరిపేట టౌన్: మండలంలోని మద్దిరాల జవహర్ నవోదయ పీఎంశ్రీ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 18వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. 2025- 26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 బ్లాకుల్లోని 23 కేంద్రాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటల్లోగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు 10.45 నుంచి 11:30 గంటల వరకు మాత్రమే లోపలికి అనుమతి ఇస్తామని చెప్పారు. పరీక్ష రాసేందుకు 4,916 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వారు httpr:// navoda ya.gov.i n వెబ్‌సైట్‌లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ నంబరు, పుట్టినతేదీ నమోదు చేసి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యల ఏర్పడితే మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయ కార్యాలయ హెల్ప్‌డెస్క్ నంబర్లు 90143 07677, 94763 15598కు కాల్ చేయాలని తెలిపారు.

స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకంతో ఆంగ్లంపై పట్టు

సర్వశిక్ష అభియాన్ ఏఎంఓ మోజెస్



ఆంగ్ల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

చీరాల: ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలు ఎంతో దోహదపడతాయని సర్వశిక్ష అభియాన్ ఏఎంఓ బి.మోజెస్ అన్నారు. చీరాలలోని వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కాలేజీలో జిల్లాస్థాయిలో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయులు, సీనియర్ రిటైర్డ్ హెచ్ఎం ఎర్ర సత్యనారాయణ రచించిన స్పోకెన్ ఇంగ్లిష్, ప్రిపోజిషన్స్ అనే ఆంగ్ల నూతన పుస్తకాలను కోర్సు డైరెక్టర్ అజయ్‌కుమార్, మోజెస్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో చక్కగా రూపొందించిన రెండు పుస్తకాలను ఉపయోగించుకోవాలన్నారు. కోర్సు కో ఆర్డినేటర్ ఎం.సుభాని మాట్లాడుతూ చాలా కాలం నుంచి సత్యనారాయణ ఆంగ్ల పుస్తకాలను రూపొందించి అందరికీ ఉపయోగపడే విధంగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముత్తాయిపాలెం హెచ్ఎం గురజాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో నుంచి ఉద్యోగ విరమణ చేసినప్పటికి ఆయన అకుంఠిత దీక్షతో ఇప్పటి వరకు 117 ఆంగ్ల పుస్తకాలను రచించారన్నారు. కార్యక్రమంలో పర్చూరు ఎంఈవో సత్యనారాయణ, డి.మాధవీలత, పి.రాజు, వై.నాగవర్ధనరావు, రిసోర్సు పర్సన్లు, సర్వశిక్ష అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

నవ భారత నిర్మాణానికి ముందడుగు వేద్దాం



రెంటచింతల: స్వామి వివేకానంద కలలు కన్న నవ భారత నిర్మాణానికి యువకులు ముందడుగు వేయాలని మాచర్ల శ్రీ రామకృష్ణసేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందురెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని తుమ్మకోట గ్రామంలో సమితి శాఖను ప్రారంభించి మాట్లాడారు. విజయవాడ రామకృష్ణ మిషన్ స్వామీజీల ఆదేశాల మేరకు రామకృష్ణ, శారదామాత, స్వామి వివేకానందల భావజాలాన్ని ప్రజలలోకి తీసుకెళ్లేందుకు గ్రామాలలో ఈ సేవా శాఖలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తుమ్మకోట నూతన కమిటీని నియమించారు.

అశ్లీలత నిరోధానికి చర్యలు తీసుకోవాలని వినతి

నరసరావుపేట: త్వరలో రానున్న కోటప్పకొండ తిరునాళ్లలో అశ్లీల డాన్సులను నివారించడం, స్వాతి వీక్లీపై నమోదైన కేసుల విచారణను వేగిరపరచడం, సంప్రదాయ, సామాజిక మాధ్యమాల్లో అసభ్య కంటెంట్‌ను నివారించడం వంటి వాటిపై సమీక్షించేందుకు ఉద్దేశించిన జిల్లాస్థాయి అశ్లీలత నిరోధక విభాగాన్ని వెంటనే సమావేశపరచాలని అశ్లీలత ప్రతిఘటన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఈదర గోపీచంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, అదనపు ఎస్పీ జేవీ సంతోష్‌ను కలసి వినతి పత్రం అందజేసినట్లు మంగళవారం పేర్కొన్నారు. 2023 సెప్టెంబర్ 30న అప్పటి కలెక్టర్ శివ శంకర్ లోతేటి అధ్యక్షతన మొదటి సమావేశం జరిగిందని గుర్తుచేశారు. రెండు నెలల క్రితమే వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఇంతవరకు మళ్లీ సమావేశం నిర్వహించలేదని వాపోయారు. తాము విజ్ఞప్తి చేసిన తర్వాత త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు గోపీచంద్ తెలిపారు.

విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం

- రైతులకు తప్పని ఇక్కట్లు
- గతేడాది ఆగస్టులో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా
- రబీసాగుపై రైతులలో అయోమయం
- పట్టించుకోని విద్యుత్ శాఖాధికారులు
- స్తంభాలు వేసి విద్యుత్ లైన్ పునరుద్ధరించాలని కోరుతున్న రైతులు



ఈదుపల్లి, తాడివాకవారిపాలెం గ్రామాలలో పంట పొలాలలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

నగరం: విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యంతో రబీలో పంటల సాగుపై రైతుల్లో అయోమయం నెలకొంది. మండలంలోని ఈదుపల్లి నుంచి తాడివాకవారి పాలెం వెళ్లే వ్యవసాయ విద్యుత్ లైన్ స్తంభాలు గతేడాది ఆగస్టులో వీచిన ఈదురుగాలులకు నేలకొరిగాయి. అప్పుడు వరి పంట ఉండటంతో విద్యుత్ స్తంభాలు వేయడానికి వీలులేదని విద్యుత్ లైన్‌లకు సరఫరా నిలిపివేశారు. ప్రస్తుతం రబీ సీజన్‌కు రైతులు సన్నద్ధమౌతున్నారు. ఈ తరుణంలో విద్యుత్ స్తంభాలను వేయాలని రైతులు విద్యుత్ శాఖాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. విద్యుత్ లైన్ పునరుద్ధించమంటే రైతులు అభ్యంతరాలు వల్ల వేయడం లేదని అధికారులు చెబుతున్నారని గతంలో ఉన్న చోట స్తంభాలు వేసేందుకు అభ్యంతరాలు ఏముంటందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఖరీప్ సీజన్‌లో సాగుకు పంటకాల్వల నుంచి సాగునీరు అందించావారమని రబీ సాగుకు పంట కాల్వలో సాగునీరుతో పంటలు సాగుచేయడం కుదరదని రైతులు చెబుతున్నారు. వేరుశనగ పంట సాగుకు స్ప్రింకర్లతో నీటిని అందించాలని దీనికి విద్యుత్ అవసరమని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను వేసి విద్యుత్ లైన్ పునరుద్ధరించాలని కోరుతున్నారు.

అభ్యంతరాల వల్ల లైన్ పునరుద్ధరించలేదు

విద్యుత్ లైన్‌కు పునరుద్ధరణకు కొంత మంది రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడం వల్ల స్తంభాలు వేయలేదు. రైతులు అంగీకరిస్తే స్తంభాలు వేసి సరఫరా పునరుద్ధిస్తాం.

–మహ్మద్ నాగుల్‌మీరా, ఏఈ, విద్యుత్ శాఖ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ



మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

బాపట్ల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ విజయమ్మ మాట్లాడారు. హెచ్ఎంపీవీ కేసులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చిన్నపిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జలుబు, జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వెంటనే వారికి సరైన చికిత్స ఇవ్వాలని తెలిపారు. అత్యవసరమైతే మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు పంపాలని వివరించారు. నవజాత శిశువులు, ఐదు సంవత్సరాల లోపు పిల్లలు, ఆస్తమా, ఊపిరితిత్తులు వ్యాధులతో బాధపడుతున్న క్రానిక్ డిసీస్ బాధపడుతున్న వారిని, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపట్ల ప్రత్యేక జాగ్రత్త తీసుకోవాలని చెప్పారు. ప్రతి హాస్పటల్‌లో చిన్న పిల్లల వార్డులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. సమావేశంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

అపోలో హాస్పటల్ ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ గోపీవర్మ

కర్లపాలెం: గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని చీరాల అపోలో హాస్పటల్ వైద్యులు డాక్టర్ రవికిరణ్, గోపీవర్మలు పేర్కొన్నారు. కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో చీరాల అపోలో హాస్పటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్ రంగనాథ్, గోపీవర్మ, సజ్జ, కావ్యారెడ్డిలు సుమారు 170 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అపోలో హాస్పటల్ మేనేజర్ గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ చీరాలలో ఏర్పాటుచేసిన తమ వైద్యశాలలో 24గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటారని, మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలందించాలనే లక్ష్యంతో కర్లపాలెం కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు తూనుగుంట్ల సుబ్బారావు, లలితబాబు తదితరులు ఉన్నారు.

నేడు పెదకూరపాడు తిరునాళ్ల

విద్యుత్ కాంతులీనుతున్న ముగ్గురు రాజుల దేవాలయం



అలంకరణలో రాజుల దేవాలయం



తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన రంగుల రాట్నం

పెదకూరపాడు: నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు ముగ్గురు రాజుల తిరునాళ్లకు సర్వం సిద్ధమైంది. ఈ సందర్భంగా ముగ్గురు రాజుల దేవాలయం విద్యుత్ దీపాలతో వెలుగులీనుతోంది. దీంతో అమరావతి – సత్తెనపల్లి రహదారిపై సందడి వాతావరణం నెలకొంది. గత 27 సంవత్సరాలుగా ఈ మహోత్సవం ఏటా నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు జిల్లా వ్యాప్తంగా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. బాలయేసును సందర్శించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా విచారణ గురువులు ఫాదర్ రెవరెండ్ పి.రాజారెడ్డి మాట్లాడుతూ... తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. దివ్యపూజ బలిని గుంటూరు పీఠాధిపతులు మహాఘన రైట్ రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. పలు విచారణ గురువులు, మఠకన్యలు పాల్గొంటారన్నారు. అనంతరం కొవ్వొత్తులు, కానుకల సమర్పణ, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్త్ నిర్వహించనున్నట్లు రాజారెడ్డి, సహాయ గురువులు బాల ధీరజ్‌లు పేర్కొన్నారు.

బంగారం దోపిడీ కేసులో ఇద్దరు అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సత్తెనపల్లి రూరల్ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: మహిళను బెదిరించి ఆటోలో తీసుకెళ్లి బంగారు ఆభరణాలు దోచుకున్న కేసులో ఇద్దర్ని సత్తెనపల్లి రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓ పి.శ్రీనివాసరావు ఈ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం... గత నెల 26న తెల్లవారుజామున పట్టణంలోని రంగా కాలనీకి చెందిన మొగిలిశెట్టి మల్లేశ్వరి అమరావతికి వెళ్లడానికి బస్సులు ఆగే ప్రాంతంలో ఉన్నారు. ఆటోలో వచ్చిన ఇద్దరు తెలిసిన వారిలా మాట కలిపి వాహనంలో ఎక్కించుకుని సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామ శివారు వద్దకు వచ్చాక బెదిరించారు. బంగారు నగలు లాక్కుని పారిపోయారు. బాధితురాలు సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులైన ఫిరంగిపురం మండలం ఎర్రగుంట్లపాడు గ్రామానికి చెందిన నన్నెబోయిన చిరంజీవి, గుంటూరు నగరాలుకు చెందిన తమ్మిశెట్టి వినోద్‌లను మంగళవారం ఉదయం గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బంగారు గొలుసు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేశారు. సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్ అమీనుద్దీన్, హెచ్‌సీ గుమ్మా నాగేశ్వరరావు, పీసీ ఓర్సు శ్రీనివాస రావు, హెచ్‌జీ నాగరాజునాయక్ ఈ కేసు ఛేదనకు కృషి చేశారన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారని తెలిపారు.

పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా నారదముని

నరసరావుపేట: డెప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా మంగళవారం పల్నాడు జిల్లాలోని పలువురికి స్థానచలనం కలిగింది. జిల్లా ప్రత్యేక కలెక్టర్ (డాక్టర్ కేఎల్ రావు సాగర్ – పులిచింతల ప్రాజెక్ట్)గా వెయిటింగ్‌లో ఉన్న బి.గాయత్రీదేవి నియమితు ల య్యారు. ఇప్పటివరకు ఆ పోస్టులో పనిచేసిన డెప్యూటీ కలెక్టర్ వరద సుబ్బారావును జిల్లా స్కూలు ఎడ్యుకేషన్ సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీగా నియమించారు. పులిచింతల ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ పీఏగా పనిచేసిన డెప్యూటీ కలెక్టర్ నారదమునిని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్‌గా నియమించారు.